

# పత్తేదారీ!

రంగు రంగుల అట్టలున్న పుస్తకాలు అరడజను కొని బిల్లు చెల్లించి చిల్లర తీసుకుంటూన్న రామ్మూర్తి చెవులు నిక్కబొడుచుకున్నాయి.

ఆ నిక్కబొడుచుకున్న చెవుల్లో ఒకదాన్లోంచి లోపలికి పోయిన "దొంగ... దొంగ" అన్న కేకలు రామ్మూర్తి చేతుల్లోని పుస్తకాల అట్టల మీద టెక్నికలర్‌లో మెరుస్తూన్న ప్రఖ్యాత పత్తేదారు మహాశయుల చేతుల్లోని జోడుగుళ్ళ పిస్తోళ్ళల్లోంచి దూసుకురాబోతున్న తూటాల్లా రెండో చెవిగుండా రివ్వున దూసుకుపోయాయి.

రామ్మూర్తి బుర్ర క్షణంలో సగకాలంపాటు అతని అభిమాన డిటెక్టివ్ తాలూకు సుప్రసిద్ధ వాహనపు స్పీడులో ఆలోచించగా కాళ్లు మరింత వేగంతో బయటికి దూకేయి.

బయట పేవ్‌మెంటు మీద ఓ పెద్దమనిషి ఆయాసంతో ఒగరుస్తూ కేకలు పెడుతున్నాడు.

"సినిమాల్లో వినాయకుడి వేషాలకు అచ్చుగుద్దినట్టు సరిపోతాడు." అంది రామ్మూర్తి బుర్రలోని ఒక భాగం ఆ పెద్దమనిషి ఆకారాన్ని చూచి.

"ఛత్! నోర్ముయ్! హాస్యాలకు వేళాపాళా లేదా! చూడు పాపం ఎలా ఆయాసపడుతున్నాడో"! అంది అదే బుర్రలోని రెండో భాగం.

అప్పటికే ఆ పెద్దమనిషి చుట్టూ పదుగురూ పోగై ప్రశ్నలు గుప్పించసాగేరు.

వారందరి తలల మీదుగా ఆ ప్రక్క సందులోకి చూస్తూ దాదాపు ఏడుపు మొహంతో చెపుతున్నాడాయన. "పట్టపగలే ఎంత దారుణమండీ? ఆ డ్రాఫ్టు మార్చి వచ్చి ఇలా ఆటో కోసం చూస్తూ నిలబడి అయిదు నిమిషాలన్నా కాలేదండీ! ఇంతలో ఇలా కత్తిరించి అలా తుర్రుమన్నాడా దొంగవెధవ."

రామ్మూర్తి కళ్లు మెరిశాయి. చేతిలోని అరడజను సరికొత్త డిటెక్టివ్ నవలల్నొకసారి చూసుకున్నాడు. వాటి అట్టలమీద కళ్లు చెదరగొట్టే రంగుల్లో దర్శనమిస్తూన్న తన అభిమాన డిటెక్టివుల సాహసకృత్యాలను ఓసారి నెమరు వేసుకొన్నాడు. వారి ప్రక్కనే సాహస విక్రమార్కులైన దొంగలూ, హంతకులూ వంకర మొహాల్తో దొంగ చూపుల్తో, చేతుల్లో బాకుల్తో, పిస్తోళ్ళతో టెక్నికలర్ ప్రింటులో మరింత భయంకరంగా కనుపిస్తూ రామ్మూర్తి కళ్ళలోకి

సూటిగా చూస్తున్నారు.

ఇవన్నీ చూసి రామ్మూర్తి ఉత్తేజితుడయ్యాడు. ఒకసారి కళ్ళు మూసుకుని తన అభిమాన డిటెక్టివులందర్నీ స్మరించాడు. తానీ శుభ క్షణాన్నుండి వారి అడుగుజాడల్లో నడవబోతున్నాడు. ఫలానా కాలేజీ స్టూడెంట్ రామ్మూర్తి ఈ నిమిషాన్నుంచీ పత్తేదారు రామ్మూర్తి కాబోతున్నాడు.

ఇదెంత చరిత్రాత్మక క్షణం.

రామ్మూర్తి జేబులోంచి నోట్‌బుక్ తీశాడు. అందులోని మొదటి పన్నెండు పేజీల్లోనూ తానెంతో కాలంగా పోగుజేస్తూ వచ్చిన పెద్దల ప్రవచనాలా సమయంలో అతని కంటికి ఏహ్యంగా గోచరించగా సర్రున చింపి వాటినా ప్రక్కనున్న చెత్తకుండీలోకి విసిరేశాడు.

పెన్ను తీసి రెండోచేత పట్టుకుని ఆ పెద్దమనిషి ముందుకు ఉరికేడు.

"అయ్యా...!"

ఆ పెద్దమనిషేగాక అక్కడ మూగిన ప్రేక్షక మహాశయులందరి కళ్ళూ రామ్మూర్తివంక తిరిగాయి.

"ఖంగారు పడక దయచేసి నేనడిగే వివరాలు చెప్పండి! మీ పేరు? "

కొన్ని జతల కళ్ళు రామ్మూర్తిని నఖశిఖ పర్యంతం వింతగా వీక్షించేయి. టెర్లిన్ గుడ్డల్లో, కూలింగ్ గ్లాసుల్తో ఆ వేసంగి మిట్టమధ్యాహ్నపు టెండలో రామ్మూర్తి హీరోలా మెరిసిపోతున్నాడు.

ఏమనుకున్నాడోగాని ఆ పెద్దమనిషి ఊరూ, పేరూ, వృత్తీ అన్నీ వివరంగా చెప్పాడు. మొత్తం మీద సారాంశమేమంటే ఆయన బ్యాంకులో డ్రాఫ్టు మార్చుకొచ్చి ఆ వెయ్యి రూపాయలూ భద్రంగా జేబులో పెట్టుకుని ఇక్కడ ఇలా ఆటోకోసం నిల్చుని వుండగా ఎవడో కొట్టేసి అలా ఆ సందులోకి ఉడాయించాడు.

సంగతంతా అరటిపండు ఒలిచి నోట్లో కుక్కినట్టుగా అరక్షణంలో వివరించేడాయన. కాని రామ్మూర్తి కాస్త చిక్కులో పడ్డాడు. డ్రాఫ్టు అంటే ఏమిటో, దాన్ని బ్యాంకులోనే ఎందుకు మార్చాలో అర్థంగాలేదు రామ్మూర్తికి. చెక్కుల్ని గురించీ, సేవింగ్సు ఎక్కౌంట్లను గురించీ మాత్రమే తెలిసిన తన అజ్ఞానానికి తనమీదే మండుకొచ్చింది రామ్మూర్తికి.

షెర్లాక్ హోమ్సునీ, పత్తేదారు అరవిందుణ్ణీ, లేటెస్టు కుర్ర, ముసలి డిటెక్టివుల్నీ గుర్తుచేసుకుని ప్రశ్నలకు ఉపక్రమించాడు రామ్మూర్తి.

"మీ డబ్బు పోయినట్లు మీకు ఎప్పుడు ఎలా తెలిసింది? "

"ఇప్పుడేగదయ్యా! ఇలా ఆటోకోసం చూస్తూ సిగరెట్టు ముట్టించుకుని అగ్గిపెట్టె జేబులో పెడుదునుగదా, గుండెలాగిపోయాయి. అగ్గిపెట్టె క్రిందపడిపోయింది. జేబు కత్తిరించబడి ఉంది" అన్నాడాయన విసుగ్గా.

క్షణమాగి ఊపిరి తీసుకుని ఆయన తిరిగి చెప్పసాగేడు. "దాంతో తల తిరిగిపోయింది. ఆదుర్దాగా చుట్టూ చూద్దును గదా, ఆ సందులోకే ఎవడో బొడ్లో ఏదో దోపుకుంటూ చుట్టూ దొంగచూపులు చూస్తూ జారుకుంటున్నాడు. వాడు బొడ్లో దోపుతున్నది నా పర్సులాగే కనుపించి వెంటనే కేకలు వేశాను. అది విని ఇక్కడ డ్యూటీలోవున్న పోలీసాకడు వాడి వెంట పడ్డాడు." అని ఓ నిట్టూర్పు విడిచాడాయన.

"పోలీసు వెంటపడ్డాడన్నమాట. అయితే ఫర్వాలేదు. దొంగను ఈసరికి ఇటు లాక్కొస్తూనే ఉండొచ్చు" అని అక్కడ మూగినవారిలో ఓ దివ్యదృష్టి గల వ్యాఖ్యాత శెలవిచ్చాడు.

ఆ మాటలు రామ్మూర్తికి కంపరమెత్తించాయి. అసలే తన మొదటి కేసు ఖూనీకేసు కాకుండా చోరీకేసయినందుకతను బాధపడుతున్నాడు. ఆ దొంగ వెధవ మరీ చేతకాని వాడిలా ఉన్నాడుగాని లేకపోతే ఆ కత్తెర ఏదో ఈ పెద్దమనిషి బొడ్లో దోపి దర్జాగానే జేబు లోంచి డబ్బు తీసుకొని మాయం కాగూడదూ. అదలా ఉండగా పట్టపగలు నడిరోడ్డున వేయి రూపాయలు కొట్టేసిన గజదొంగను ఓ మామూలు పోలీసువాడు పట్టుకోవడమా...! ఛ! ఛ!... ! సర్కిలినస్పెక్టరయినా ఇంత పెద్ద కేసును పరిష్కరించగలడా..? లేదు... లేదు... అలా ఎన్నటికీ జరగదు!

రామ్మూర్తి తన చేతుల్లోని పుస్తకాల అట్టలమీది అభిమాన డిటెక్టివుల్ని మరోసారి చూసు కున్నాడు. అవును, ఈ మహాపురుషులు మాత్రమే ఇలాంటి గజచోరీ కేసుల్ని పట్టుకోగలరు. వారి శిష్యుడయిన తాను ప్రయత్నిస్తే ఫలితం ఉండకపోదు.

ఈ ఆలోచనల్తో రామ్మూర్తికి ఆవేశం ముంచుకు వచ్చింది. తిరిగి ధీమాగా ప్రశ్నించేడు.

"ఆ దొంగ వెధవ అలా పారిపోతుంటే మీరు అమాంతం వాడి మీదకురికి వాడిపీక పట్టు కోక ఊరికే కేకలేసి వాడు పారిపోవటానికెందుకవకాశమిచ్చారు."

ఆ పెద్ద మనిషి జవాబివ్వకుండా తలొంచుకున్నాడు. ఇంతలో ఆ గంపులోంచి ఎవరో అరిచారు. "ఆ మాత్రం తెలీదటయ్యా: అంతపెద్ద బొజ్జతో ఆయన ఎలా దూక గలడు."

ఈ జవాబుతో ఆ పెద్దమనిషీ, రామ్మూర్తీ కూడా ఉలిక్కి పడ్డారు.

ఆయన కోపంగా గుంపువైపు చూసి, రామ్మూర్తి వంక తిరిగి అడిగాడు "నన్నింతగా అడు గుతున్నారుగదా. అయ్యా ఇంతకీ తమరెవరు? "

రామ్మూర్తి క్షణకాలం నిశ్చేష్టుడయ్యాడు. ఆయన తననిలా ప్రశ్నిస్తాడనుకోలేదు. తన అభి మాన డిటెక్టివ్‌లంతా ఎప్పుడు ఎక్కడ ఎవరిని ఎలాంటి ప్రశ్నలడిగినా ఎంతో వినయంగా జవాబులిస్తారే. చివరికి పెద్దపెద్ద పోలీసు ఆఫీసర్లు సైతం వారిని చంక నెక్కించుకుంటారే. వారిని ఎవరయినా ఇంతవరకూ "మీ రెవరు? " అని అవమానించగలిగారా?

తననలా ప్రశ్నించినందుకు రామ్మూర్తికి ఆ పెద్ద మనిషిమీద మండుకొచ్చింది. కాని డిటె క్టివులు ఎంతో ఓర్మితో పనిచేయాల్సి వుంటుందని తన అభిమాన పత్తేదార్లనేకులు ఏదో ఒక సందర్భంగా తమ అసిస్టెంట్లతో చెప్పుండగా తాను చదివాడు కూడాను. అందులోనూ ఇదే తన మొదటికేసాయె. అందువల్ల అతి ప్రయత్నంమీద తన ఆగ్రహాన్ని అణచిపెట్టుకున్నాడు.

అయితే ఇప్పుడేం చేయాలి? రామ్మూర్తి తీవ్రంగా ఆలోచించసాగాడు. ఆ దొంగను పట్టు కోవాలి. ఈ గజ చోరీ కేసును పరిష్కరించాలి. ప్రఖ్యాత పత్తేదారు రామ్మూర్తి ఘనతను, శక్తి సామర్థ్యాలను చోర, చోరేతర ప్రపంచానికి చాటాలి. అప్పుడు ఈ పెద్దమనిషే ఈ నాడిలా తనను ప్రశ్నించినందుకు కాళ్ళమీద గాకపోయినా కనీసం చేతుల మీద పడయినా క్షమాపణ చెప్పుకోవాలి.

ఈ ఆలోచనల్తో రామ్మూర్తి ఆ గుంపులోంచి బయటపడ్డాడు. ఆ పెద్ద మనిషి డబ్బు పోగొట్టుకొని ఇంకా పావుగంటన్నా కాలేదు. ఆ దొంగా, ఆ పోలీసూ ఈ సందులోంచే పరు గెత్తారు గదా. ఈసరికి మహా అయితే ఓ నాలుగు ఫర్లాంగులు పోయుంటారు. తాను టాక్సీలో దూసుకుపోతే పోలీసుకన్నా ముందుకుపోయి అరనిమిషంలో ఆ గజదొంగను పీక మీద వాటేసి పట్టుకోగలడు.

రామ్మూర్తికి కొత్తశక్తి పట్టినట్లయింది. తన అభిమాన డిటెక్టివులంతా ఆ క్షణాన తన్నావే శించినట్లయింది. మరి ఆలోచించకుండా అలా ఆ పేవ్‌మెంటు వారనే ఆగివున్న కారులోకి

దూకేశాడు. తలుపు దభాలున మూసి "పోనీ... పోనీ... ఆ ప్రక్కసందులోంచి పోగలిగి నంత వేగంగా పోనీ. నేనెవర్నో తెలుసా? ప్రైవేట్ డిటెక్టివ్ రామ్మూర్తిని". అని ఆజ్ఞాపించాడు.

ఇంతసేపూ స్టీరింగు మీద ఆనుకుని ప్రక్క షాపులో బేరం చేస్తున్న ఆడవాళ్ళవంక పరధ్యాన్నంగా చూస్తున్న డ్రైవరు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

వెనుక సీట్లో కూర్చున్న రామ్మూర్తి ఆ డ్రైవరు మొహం చూసి అంతకన్నా ఎక్కువగా ఉలిక్కిపడ్డాడు. అతని గుండెల్లో అయిదారు బాంబు లొక్కసారిగా ప్రేలినట్లయింది. "మీరా: ప్రిన్సిపాల్ గారూ: క్షమించాలి. టాక్సీ అనుకున్నాను" అంటూ ఆ కార్లోంచి బయటపడ్డాడు.

"ఆరి భగవాన్, ఎంతపని జరిగిపోయింది. కొంపదీసి రేపు ఆఫీసుకు పిలిచి కాలేజీ లోంచి పొమ్మనడుగదా." అనుకుంటూనే రామ్మూర్తి అటు ఖాళీగా వస్తున్న ఆటోరిక్షాను చూసి ఆపమని సంజ్ఞ చేస్తూనే అందులోకి దూకేశాడు.

అవునుమరి, తన అభిమాన డిటెక్టివులంతా అలా దూకేస్తూంటారే గాని వాడు ఆపేదాకా ముసలమ్మల్లా ఆగి ఎక్కరు గదా. వెధవది టాపు తగిలి తల బొప్పికట్టిందే అనుకో. అయినా తాను చేయబోతున్న మహత్కార్యం ముందు యీ బొప్పె ఒక లెక్కలోదా.

ఆటో రిక్షా నాలుగు ఫర్లాంగులు దాటింది. ఎగుడు దిగుడుగా వున్న సందు గొందులన్నీ దాటి సిమెంటు రోడ్డుమీది కొచ్చి మరి నాల్గుమైళ్లు కూడా దాటింది. రామ్మూర్తి వున్న రెండు కళ్లూ చిట్లించి జాగ్రత్తగా రోడ్డంతా పరీక్షిస్తున్నాడు. కాని ఇంతవరకూ ఎక్కడా ట్రాఫిక్ పోలీసు గాని, వాడిచేత తరుమబడుతూన్న గజ జేబుదొంగ గానీ ఎదురవలేదు.

ఆటో ముందుకు పోతూన్న కొద్దీ రామ్మూర్తి ఉత్సాహం నీరుగారి పోజొచ్చింది పదిహేను నిమిషాల క్రితం బొడ్లో పర్సుతో ఇటు పరుగెత్తిన ఆ దొంగ వెధవ ఇంతలో ఎలా మాయమయ్యాడు? ఆ ట్రాఫిక్ పోలీసుగాడు ఎక్కడ తగలడ్డాడు? ఒకవేళ వాళ్ళిద్దరూ లాలూచీ పడి చెరిసగం పంచుకొని మాయమవలేదుగదా: అని సతమతం కాసాగాడు.

ఆటో రిక్షా తిరిగి, తిరిగి బయలుదేరిన చోటికే వచ్చి ఆగింది. అందులోంచి జీవచ్ఛవంలా దిగాడు రామ్మూర్తి.

ఆ పెద్ద మనిషి ఇంకా అక్కడే ఉన్నాడు. చుట్టూ వున్న గుంపు మరింత పెద్దదయింది కాని రామ్మూర్తికి యీ సారి అటుపోవటానికి మనస్కరించలేదు. ఈ రోజున తన ప్రథమ ప్రయత్నమిలా విఫలమయ్యింది. తన మొట్టమొదటి కేసే ఫేలయ్యింది. ప్రొద్దున్నే లేవగానే తానెవరి మొహం చూసిందీ గుర్తుకురాలేదు రామ్మూర్తికి. బహుశా రాత్రి చదువుతూ ప్రక్క మీద అలాగే వదిలేసిన డిటెక్టివ్ నవల అట్టమీది తన అభిమాన పత్తేదారు పంచరంగుల మొహాన్నే చూసుండాలి... అని అనుమానించసాగేడు రామ్మూర్తి.

ఇలా ఆలోచిస్తూ, అనుమానిస్తూ రామ్మూర్తి ప్రక్కనున్న కిళ్ళీ షాపుకు పోయి సోడా త్రాగి చిల్లర కోసం జేబులో చేయి పెట్టాడు. చిల్లరతోపాటు పొడవాటిదేదో చేతికి తగిలింది. ఏమిటా అని బయటికి తీసి చూశాడు. అది సైకిల్ తాళం చెవి.

రామ్మూర్తి తొందర తొందరగా బుక్ స్టాలు వద్దకునడిచాడు. ఖాళీగా వున్న బుక్‌స్టాల్ పేవ్‌మెంట్ చూడగానే రామ్మూర్తి గుండెల్లో అయిదు బాంబులు ఒక్కసారిగా పేలాయి. ఆదుర్దాగా బుక్‌స్టాల్‌లోనికి పోయాడు.

"అనేక మంది వస్తూ పోతుంటారు. ఏది ఎవరిదో మే మెలా కనిపెట్టి ఉండగలమండీ:" అని మర్యాదగానే మందలించాడు బుక్‌స్టాల్ మేనేజరు.

రామ్మూర్తికి ఏమనటానికి పాలుపోలేదు. ప్రఖ్యాత పత్తేదారు రామ్మూర్తి సరికొత్త రాలీ సైకిల్ని పట్టపగలు మారుతాళంతో హత్య చేసినవాడు ఎంత సాహసుడై వుండాలి. వాడి గుండెలు దేనితో తయారయివుండాలి?

ఆలోచిస్తున్న రామ్మూర్తి బుర్రలో హఠాత్తుగా మెరుపు మెరిసినట్లయ్యింది. జేబులోంచి నోట్ బుక్ తీసి జాగ్రత్తగా పరిశీలించాడు. అతని కళ్ళు విజయగర్వంతో మెరిశాయి.

నిల్చున్న పళంగా పరుగు పుచ్చుకున్నాడు పత్తేదారు రామ్మూర్తి, పోలీసు స్టేషన్లో తన సైకిలు నంబర్ను రిపోర్టు చేసేందుకు.

*(డిటెక్టివ్ సాహిత్యం ఉద్ధృతంగా వస్తూన్న రోజుల్లో -1958)*

☆